జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్, కమిషనర్‌కు విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. వ్యక్తిగత సమస్యలపై ఎక్కువ విన్నపాలు వస్తున్నాయని, సమస్య పరిష్కారం అయినట్లు అర్జీదారునికి లేఖ పూర్వకంగా తెలియజేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెడ్ ఆఫీస్‌లో 70 విన్నపాలు, జోనల్, సర్కిళ్లలో కలిసి మొత్తం 87, మొత్తం 157 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రజావాణికి ముందుగా కమిషనర్ రొనాల్డ్ రాస్ ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నగర ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, చంద్రకాంత రెడ్డి, యాదగిరి రావు, జయరాజ్ కెన్నెడీ, గీతా రాధిక, ఎస్టేట్ డైరెక్టర్ మహమ్మద్ బాషా, సీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

8 నెలలుగా జీతాల్లేవ్.. బతికేదెట్లా..?

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు 8 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కృష్ణ, శ్రీనివాస్, సుగుణ, రవి, నరసింహ, శ్రీకాంత్, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. - మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 26

హెచ్ఎండీఏ భూముల.. లెక్కలు తేల్చండి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో భూముల లెక్కలు తేల్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం హెచ్ఎండీఏ కార్యకలాపాలపై ప్రధానంగా దృష్టి సారించింది. ఇప్పటికే ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్, ల్యాండ్‌పూలింగ్ విభాగాలపై పలుమార్లు మెట్రోపాలిటన్ కమిషనర్ నేతృత్వంలో సమీక్షలు నిర్వహించారు. ఇటీవల ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న మొత్తం భూముల వివరాలు కావాలని కోరారు. దీంతో మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ హెచ్ఎండీఏ ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులకు భూముల లెక్కలతో సమీక్షకు రావాలని ఆదేశించారు. ఈ మేరకు ఎస్టేట్ విభాగంలోని ఉన్నతాధికారులు, ఉద్యోగులంతా ఆదివారం కూడా అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయానికి వచ్చి భూముల వివరాలపై నివేదికను సిద్ధం చేసుకున్నారు. సోమవారం మెట్రోపాలిటన్ కమిషనర్ ఎస్టేట్ ఆఫీసర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టి మెహమ్మద్ అసదుల్లాతో పాటు ఇతర అధికారులతో హెచ్ఎండీఏకు చెందిన భూములపై ప్రధానంగా చర్చించారు. ప్రధానంగా నగర శివారులోని జవహర్‌నగర్‌లో హెచ్ఎండీఏకు 3వేల ఎకరాల వరకు ఉండగా, అందులో చాలా పెద్ద మొత్తంలో కబ్జాలు కాగా మిగిలిన భూముల పరిస్థితిపై చర్చించారు. అదేవిధంగా శంషాబాద్, మియాపూర్, బుద్వేల్, కోకాపేట, వట్టినాగులపల్లి, ఉప్పల్ భగాయత్ ప్రాంతాల్లో మొత్తం ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయి, వాటిపై ఉన్న కేసులు వివరాలను అడిగారు. దీనికి ఎస్టేట్ విభాగం ఉన్నతాధికారులు మొత్తం భూముల వివరాలపై నివేదికను రూపొందించి ఇస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్‌కు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై అయోమయం

మార్చి 31లోగా క్రమబద్ధీకరణకు సర్కారు ఆదేశాలు

- విధి విధానాలు అందలేదంటున్న అధికారులు
- నెల రోజుల్లో దరఖాస్తుల పరిశీలన అసాధ్యమంటున్న యంత్రాంగం
- ఆదాయం కోసమే తొందర పాటు నిర్ణయమా...?
- క్రమబద్ధీకరణతో హెచ్ఎండీఏ పరిధిలో వెయ్యి కోట్ల ఆదాయం
- జీహెచ్ఎంసీ పరిధిలో రూ.450 కోట్ల ఆదాయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను ముగించాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు తప్పా ఇతర భూముల రెగ్యులరైజేషన్‌ను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. 2020లో ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) పరిధిలోనే 5 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 1,06,920 వరకు వచ్చాయి. వీటిని క్రమబద్ధీకరణ చేస్తే ఫీజుల రూపంలో సుమారు రూ. 450 కోట్ల ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా. 7 జిల్లాల పరిధిలో విస్తరించిన ఉన్న హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 47 మునిసిపాలిటీలను మినహాయిస్తే మిగతా ప్రాంతాల్లోంచి వచ్చిన దరఖాస్తులే 3,44,726 వరకు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 50,025 దరఖాస్తులను హెచ్ఎండీఏ అధికారులు జోన్‌ల వారిగా పరిశీలన చేశారు. మిగతా వాటిని పరిశీలన చేసి క్రమబద్ధీకరించే పనిని వేగవంతం చేయనున్నారు.

హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు

జోన్స్	స్వీకరించినవి	పరిశీలించినవి
శంకర్‌పల్లి	73915	12193
ఘట్‌కేసర్	159672	14872
మేడ్చల్	30850	10058
శంషాబాద్	80289	12902
మొత్తం	344726	50,025

అధికారుల్లో స్పష్టత కరువు..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణపై అధికారుల్లో అయోమయం నెలకొంది. ఎల్ఆర్ఎస్ పథకం అమలుపై కోర్టుల్లో కేసులు నమోదు కావడంతో గత ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టలేదు. కేవలం సింగిల్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.1000ల చొప్పున, ఒకేసారి లేఅవుట్ మొత్తానికి క్రమద్ధీకరణ చేసేందుకు రూ.10వేల చొప్పున 2020లో ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. దీనిపై కోర్టులో ఫిటిషన్లు దాఖలైనప్పటికీ ఎలాంటి తీర్పులు వెలువడలేదు. అయితే ఇదే సమయంలో సిబ్బంది కొరతతో రాష్ట్ర స్థాయిలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)ని ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను క్రమపద్ధతిలో ఉంచి, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల వారీగా వేరు చేసింది. ఆయా విభాగాలు దరఖాస్తుల పరిశీలన చేస్తూ, ఫీజు చెల్లించే వరకు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్‌ను మాత్రం జారీ చేయలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నుంచే వచ్చే లిఖిత పూర్వక ఆదేశాలతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపడతామని, నెల రోజుల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యం కాదని ఓ ప్లానింగ్ అధికారి తెలిపారు.

జీహెచ్ఎంసీ పరిధిలో ఎల్ఆర్ఎస్ వివరాలు

జోన్	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు	ప్రాసెస్ చేసినవి	తిరస్కరణ అయినవి	షార్ట్‌ఫాల్	ఫీజు కట్టాల్సినవి	పరిశీలన కానివి
ఎల్బీనగర్	39234	4333	0	3473	1	34901
చార్మినార్	15283	7536	0	3821	0	7747
ఖైరతాబాద్	5725	1264	0	1146	0	4461
సికింద్రాబాద్	5694	3720	363	2892	11	1974
శేరిలింగంపల్లి	18622	5377	18	4866	41	13245
కూకట్‌పల్లి	22362	11230	2145	8289	32	11132
మొత్తం	106920	33460	2526	24487	85	73460

ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

రోడ్డెక్కిన డేటా ఎంట్రీ ఆపరేటర్లు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 : ప్రజాపాలన డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆందోళన బాట పట్టారు. నెల రోజుల నుంచి వారు చేసిన కష్టానికి డబ్బులు ఇవ్వకుండా అధికారులు సతాయిస్తుండడంతో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేపట్టారు. తక్షణమే తమకు చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన కొనసాగిస్తామని బాధితులు మహ్మద్ యాసర్, సల్మాన్, మోహిద్ అలీ, పునీత్, అమీనా, రుషి, ముస్కాన్, సోఫియా, హీనా, తెలిపారు.

స్టార్ హోటల్‌లో డ్రగ్స్ పార్టీ

హోటల్‌పై ఎస్‌వోటీ పోలీసుల సోదాలు

- పోలీసుల అదుపులో నలుగురు.. పరారీలో ఆరుగురు
- పట్టుబడిన వారిలో సినీ, రాజకీయ ప్రముఖులు
- నిందితులకు డగ్స్ సరఫరాపై పోలీసుల ఆరా

సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : స్టార్ హోటల్‌ను అడ్డాగా చేసుకొని డ్రగ్స్ పార్టీలు చేసుకుంటున్న ఓ ముఠాను సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి సోమవారం మీడియాకు వివరించారు. గచ్చిబౌలిలోని ర్యాడిసన్ బ్లూ హోటల్‌లో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం రావడంతో మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు హోటల్‌లో సోదాలు నిర్వహించారు. పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బీజేపీ నాయకుడు యోగానంద్ కొడుకు మంజీర గ్రూప్స్ డైరెక్టర్ వివేకానంద తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నట్లు పోలీసులు సమాచారం సేకరించి అతని ఇంటికి వెళ్లారు. పోలీసులు ఇంట్లోకి రాకుండా డోర్ లాక్ చేయడంతో 5 గంటలు పోలీసులు వివేకానంద ఇంటి బయట ఎదురు చూసి చివరకు ఇంట్లోకి వెళ్లారు. ఇంట్లో ఉన్న డ్రగ్స్‌ను వాష్‌రూమ్‌లో పడేసి, సెల్‌ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్స్, కాంటాక్టులను డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. తెల్లవారుజామున వివేకానందను అదుపులోకి తీసుకొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో డ్రగ్ తీసుకున్నట్లు పాజిటివ్ రిపోర్టు వచ్చింది. అతనిని విచారించగా మరికొంత మంది పేర్లు వెల్లడించాడు. అందులో సయ్యద్ అబ్బాస్ అలియాస్ జాఫ్రీ, నిర్భయ్, కేదార్‌ను అదుపులో తీసుకొని పరీక్షించగా ఇద్దరికి డ్రగ్ వాడినట్లు పాజిటివ్ రిజల్ట్ వచ్చింది. పార్టీలో వీళ్లంతా కొకైన్ డ్రగ్ వాడినట్లు అనుమానిస్తున్నారు. 10 మంది కలిసి పార్టీ చేసుకోగా, ఆరుగురు పరారీలో ఉన్నారు. నిందితులకు డ్రగ్స్ సరఫరాపై ఆరా తీస్తున్నట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ వెల్లడించారు. ఇదిలా ఉంటే పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఓ తెలుగు సినీ నటుడి వ్యాపార భాగస్వామి శెలగంశెట్టి కేదార్‌నాథ్ అలియాస్ కేదర్ పట్టుబడడం ఇప్పుడు సంచలనంగా మారింది. కేదార్‌నాథ్ ప్రైవేట్ ఛార్టెడ్‌ను కూడా నిర్వహిస్తూ సినీ, రాజకీయ ప్రముఖులకు పంపిస్తుండేవాడని పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం సినీ నిర్మాతగా పలు సినిమాలు నిర్మిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు.. 71 మంది ఎస్ఐల బదిలీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలో పోలీసు అధికారుల బదిలీల పరంపర కొనసాగుతోంది. అయితే కొత్త పోస్టింగ్‌ల్లో చేరి, సర్దుకునేలోపే మళ్లీ బదిలీలు కావడంతో అధికారులు బేజారవుతున్నారు. మొన్నటికి మొన్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ఎస్ఐ నుంచి కమిషనర్ స్థాయి అధికారుల వరకు దాదాపు సిబ్బందిని బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో మరోసారి బదిలీలు తప్పలేదు. అంతలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఇప్పుడు మళ్లీ అధికారుల బదిలీ పరంపర మొదలైంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ పరిధిలో తాజాగా 71మంది ఎస్ఐలు, 7మంది సీఐలను బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ కే.శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సీఐల బదిలీల విషయానికి వస్తే గోపాలపురం ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న తవిటి నర్సింగ్‌రావును చార్మినార్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డిని గోపాలపురం ఎస్‌హెచ్‌వోగా, మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వోను ఎస్‌బీ 3వ బెటాలియన్‌కు, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్‌ను మారేడ్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా, గోపాలపురం ట్రాఫిక్ పీఎస్ ఎస్‌హెచ్‌వో ఎస్.సైదులును చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌వోగా, మల్టీజోన్-2 ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరాములును గోపాలపురం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. కాగా చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌వో వై.ప్రకాశ్‌రెడ్డిని మల్టీజోన్-2కు సరెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హెచ్ఎండీఏ డీఎస్పీగా జానకి రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా జానకి రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్‌ఫోర్స్ విభాగం డీఎస్పీగా అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహించనున్నారు. ఇంతకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా పని చేసిన సత్తయ్యను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇప్పటి వరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న జానకి రెడ్డి విధుల్లో చేరారని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

కేరళ రాష్ట్ర మున్సిపల్ మేయర్లు, చైర్మన్లతో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ తదితరులు

వావ్.. హైదరాబాద్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరాన్ని గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా రూపొందించడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ నగర పాలక సంస్థ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కేరళ రాష్ట్రం మున్సిపల్ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు మొత్తం 58 మంది బృందం జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేయడానికి సోమవారం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగర అభివృద్ధికి చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ నిర్వహణ, ఇంటింటికీ చెత్త సేకరణ, సీఅండ్‌డీ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లు, వేస్ట్ రీసైక్లింగ్ మెటీరియల్, తదితర అంశాలను మేయర్ వివరించారు.

ప్రతి రోజు స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో ఇంటింటి నుంచి ప్రతి రోజూ సేకరించిన 7500 మెట్రిక్ టన్నుల చెత్తను జవహర్ నగర్ డంప్ యార్డు తరలించి వర్మీ కంపోస్టు తయారీ చేస్తామని కమిషనర్ తెలిపారు. ప్యారా నగర్‌లో మరొక డంపు యార్డు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలకు రెండు ప్లాంట్లను ఏర్పాటు చేశామని, మరో రెండు ప్లాంట్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. డంపింగ్ యార్డుకు తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ మ్యాపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఫ్లైఓవర్‌లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, సోషల్ సెక్యూరిటీ పథకాలు అమలు చేసినట్లు కమిషనర్ వివరించారు. స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశాల నిర్వహణ, తదితర విషయాలపై కేరళ బృందం అడిగిన ప్రశ్నలకు మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం కేరళ బృందం జీహెచ్ఎంసీలో ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రంలో జనాభా, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యతతో తమ మున్సిపాలిటీలలో చేపట్టే బెస్ట్ ప్రాక్టీసెస్ కార్యక్రమాలను వారు వివరించారు. ఈ సందర్భంగా వారు మేయర్, కమిషనర్, అధికారులు, కౌన్సిల్ సభ్యులను తమ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ఆహ్వానించారు. హైదరాబాద్ నగరంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఆదాయ వనరులు బాగున్నాయన్నారు. చూడదగ్గ నగరాలలో హైదరాబాద్ ఒకటని, ఈ నగర సందర్శన తమకు ఆనందాన్ని ఇచ్చిందని కేరళ బృందం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్ర మున్సిపల్ మేయర్లు, చైర్మన్లు, జీహెచ్ఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ విధానాలు భేష్

చూడదగ్గ నగరాల్లో హైదరాబాద్ ప్రత్యేకం

నగర టూర్ ఎంతో ఆనందాన్నిచ్చింది

కేరళ రాష్ట్ర మున్సిపల్ మేయర్లు, చైర్మన్లు